# సైలెంట్ దూకుడు..!

**-గ్రేటర్‌లో 1.8 లక్షలకు చేరిన ఎలక్ట్రిక్ వాహనాలు -చార్జింగ్ స్టేషన్ల సంఖ్య పెరిగితే మరింత రయ్ రయ్**
**-జీవితకాల పన్ను మినహాయింపు..సిటిజనుల చూపు.. ఈవీల వైపు..**




**హైదరాబాద్, డిసెంబరు 2 ప్రభాతవార్త**
ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ) సైలెంట్‌గా దూసుకెళ్తున్నాయి. నగరవాసులు ఈవీలపై ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వం ఈ వాహనాలపై జీవితకాల పన్నును మినహాయించడంతో ప్రస్తుతం ప్రతి రోజూ వందకు పైగా ద్విచక్ర వాహనాలు అమ్ముడవుతున్నాయి. ఆటో రిక్షాలు, ఇతర వాహనాల వినియోగం కూడా క్రమంగా పెరుగుతోంది. కార్ల అమ్మకాలు మాత్రం ఆశించిన స్థాయిలో కనిపించడంలేదు. విద్యుత్ చార్జింగ్ స్టేషన్‌లు డిమాండ్ మేరకు అందుబాటులో లేకపోవడమే ఇందుకు కారణం. ఈవీలపై పన్ను మినహాయింపున్విడం వల్ల వివిధ శ్రేణులకు చెందిన కార్లపై కనిష్టంగా చెందిన కార్లపై కనిష్టంగా రూ.50 వేల నుంచి గరిష్టంగా రూ.42లక్షల వరకూ జీవితకాల పన్ను రద్దయ్యే అవకాశం ఉంది. దాదాపు రూ.2.5కోట్ల విలువైన బీఎండబ్ల్యూ కారుపై రూ.45లక్షల వరకు పన్ను మినహాయింపు లభిస్తుంది. అలాగే టాటా నెక్సాన్, టాటాపంచ్ వంటి బ్రాండ్‌లకు చెందిన కార్లపై రూ.2.3లక్షల నుంచి రూ.2.9 లక్షల వరకు పన్ను రాయితీ పొందవచ్చు. ఇలా కార్లపై రూ.లక్షల్లో రాయితీ లభిస్తున్నప్పటికీ విద్యుత్ చార్జింగ్ కొరత కారణంగా అమ్మకాలు ఆశించిన స్థాయిలో లేవని ఆటోమొబైల్ డీలరున్ల చెబుతున్నారు.

**ప్రతీ 3 కిలో మీటర్లకు ఒకటి అవసరం..**
ప్రస్తుతం గ్రేటర్ పరిధిలో కేవలం 400 చార్జింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో ప్రభుత్వం ఏర్పాటు చేసినవి 52 కేంద్రాలు మాత్రమే. మిగతావన్నీ ప్రైవేట్ వ్యక్తులు, సంస్థల నిర్వహణలోనే ఉన్నాయి. హోటళ్లు, షాపింగ్ కేంద్రాలు, మాల్స్ తదితర చోట్ల చార్జింగ్ సదుపాయం ఉంది. ఆర్టీసీ డిపోల్లో చార్జింగ్ సదుపాయం ఉన్నా ప్రస్తుతం బస్సుల వినియోగానికే అది పరిమితం. సాధారణ వాహనదారులు వినియోగించేందుకు అవకాశం లేదు. ఇటీవల శంషాబాద్ ఎయిర్‌పోర్టులో వాహనాల పార్కింగ్ వద్ద సుమారు 100 చార్జింగ్ యూనిట్‌లను ఒకేచోట ఏర్పాటు చేశారు. అలాంటివి నగరంలో వీలైనన్ని ఎక్కువ చోట్ల ఏర్పాటు చేయాల్సి ఉంది. మరోవైపు జాతీయ రహదారులు, సిటీరోడ్లపై వాహనాల డిమాండ్ మేరకు ప్రతి 3 కిలో మీటర్‌లకు ఒకటి చొప్పున చార్జింగ్ స్టేషన్‌లు ఉండాలి. సుమారు 600 చార్జింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేయాలని గతంలో ప్రణాళికలను రూపొందించారు. కానీ ఆ దిశగా ఇప్పటి వరకు పురోగతి కనిపించడం లేదు. ఇప్పటికిప్పుడు కనీసం 100 కేంద్రాలు అవసరం.

**200 మిలియన్ యూనిట్‌ల విద్యుత్..**
దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కమ్) అంచనాల మేరకు ఈ ఏడాది గ్రేటర్ ఈవీ వాహనాల చార్జింగ్ సుమారు 200 మిలియన్ యూనిట్‌లకు చేరింది. ఏటా విద్యుత్ వినియోగం పెరుగుతూనే ఉంది. ఎలా చూసినా ఎలక్ట్రిక్ వాహనాల పట్ల అన్ని వర్గాల్లో ఆసక్తి పెరిగింది.

**1.45లక్షల ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు..**
విద్యుత్ చార్జింగ్ కేంద్రాల కొరత ఉన్నప్పటికీ ఈవీల సంఖ్య క్రమంగా పెరుగుతూనే ఉంది. ప్రస్తుతం గ్రేటర్‌లో అన్ని రకాల వాహనాలు సుమారు 75లక్షల వరకు ఉంటే ఎలక్ట్రిక్ వాహనాలు 1.8లక్షల వరకు ఉన్నాయి. వీటిలో 1.50లక్షలు ద్విచక్ర వాహనాలే కావడం గమనార్హం. కార్ల సంఖ్య తక్కువే. కేవలం 12.765 ఎలక్ట్రిక్ కార్లు ఇప్పటి వరకు నమోదయ్యాయి. సుమారు 3,858కు పైగా ఆటోలు, మరో 2వేల వరకు ట్యాక్సీలు తిరుగుతున్నాయి. ఇవి కాకుండా ఇతర కేటగిరీలకు చెందిన ఎలక్ట్రిక్ వాహనాలు 4,500కు పైగా ఉన్నట్లు అంచనా.

# హైదరాబాద్ వార్త



# నేడు "హెచ్‌సిటీ" పనులకు శంకుస్థాపన

**-రూ.3666.50కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించనున్న సిఎం రేవంత్‌రెడ్డి**
**-ఫ్లైఓవర్ల నిర్మాణం, రోడ్ల అభివృద్ధి, కూడళ్ల సుందరీకరణ పనులకు శంకుస్థాపన**



లేక్‌వ్యూ గెస్ట్ హౌస్ వద్ద వరద నివారణ కోసం నిర్మిస్తున్న రెయిన్ వాటర్ సంపు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సిఎం రేవంత్ రెడ్డి,మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, డిసెంబర్ 2,ప్రభాతవార్త:**
గ్రేటర్ లో ట్రాఫిక్ కష్టాలకు ఫుల్ స్టాప్ పెట్టేందుకు జీహెచ్‌ఎంసీ సిద్ధమైంది. హెచ్‌సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫర్మేటివ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) పథకంలో భాగంగా రూ.3666.50 కోట్లతో పలు అభివృద్ధిపనులు చేపట్టనుంది. ఈ పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు (3వ తేదీ) మంగళవారం శంకుస్థాపన చేయనున్నారు. మధ్యాహ్నం 3గంటలకు హైమాక్స్ సమీపంలోని హెచ్‌ఎండీఏ గ్రౌండ్ వేదికగా హైదరాబాద్‌లో చేపట్టబోయే పనులను ప్రారంభించన్నారు. రోడ్ల అభివృద్ధికి రూ. 3500 కోట్లు, 12 వాటర్ హోల్డింగ్ నిర్మాణాలు రూ.16.50 కోట్లు. రోడ్లలోని 283 కూడళ్ల సుందరీకరణకు రూ. 150 కోట్లు వెచ్చించి చేసే పనులకు సిఎం చేతుల మీదుగా శిలాఫలకం వేయనున్నారు.. అందులోభాగంగా ఖైరతాబాద్ జోన్ పరిధిలోని రేతిబౌలి, నానల్ నగర్‌లో రూ.398 కోట్లు, ఎన్ఎఎస్‌పి కూడలి, టివి9 కూడలిలో రూ. 210 కోట్లతో అండర్‌పాస్, విరించి హాస్పిటల్ కూడలి విస్తరణ, రోడ్డుఏర్పాటు. జూబ్లీహిల్స్‌చెక్‌పోస్టు కూడలిలను 100 అడుగుల నుంచి 120 అడుగులుగా పెంచేందుకు రూ. 150 కోట్లు కేటాయించారు.. శేరిలింగంపల్లి జోన్ : ఖాజాగూడ,విప్రో సర్కిల్, ఐఐఐటి కూడలిలో ఫ్లైఓవర్ నిర్మాణం కొరకు రూ.837 కోట్లు, మియాపూర్ కూడలి నుంచి ఆల్విన్ కూడలిలో బై డైరెక్షనల్ ఫ్లైఓవర్, లింగంపల్లి సర్కిల్ నుంచి గచ్చిబౌలి వరకు యూని డైరెక్షనల్ అండర్ పాస్లను రూ.530 కోట్లు. శేరిలింగంపల్లి రైల్వే స్టేషన్ వద్ద ఆర్ఓబీ రూ. 124 కోట్లు, అమీన్‌పూర్ నుంచి జాతీయ రహదారి 65 వరకు రోడ్డు వెడల్పు రూ.45 కోట్లు, సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌నుంచి గచ్చిబౌలి కూడలి వరకు 215అడుగుల రోడ్డు వెడల్పు అభివృద్ధికి రూ.39 కోట్లు, అంజయ్య నగర్ నుంచి రాంకీ టవర్ రోడ్ వరకు రోడ్డు విస్తరణ, అభివృద్ధి రూ. 31 కోట్లు కేటాయింపు. కూకట్పల్లి జోన్ : కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద మియాపూర్ వైపు, అమీర్‌పేట్ వైపు 3 లేన్ల రెండు ఫ్లైఓవర్లు రూ.180 కోట్లు, ఫాక్స్ సాగర్ సరస్ నాలాపై స్టీల్ బ్రిడ్జ్ ఏర్పాటుకు రూ.56 కోట్లు.

**సికింద్రాబాద్ జోన్ :**
రసూల్ పురా కూడలిలో యూని డైరెక్షనల్ ఫ్లైఓవర్లో. 150 కోట్లు, డిపాజిట్ పనులుగా పాటిగడ్డ ఆర్ బి రూ.80 కోట్లు, ఆర్కేపురం ఆర్ బి రూ.210 కోట్లు. ఆర్కేపురం ఆర్యబి రూ.35 కోట్లు, చిలకలగూడ ఆర్యుబి రూ.30 కోట్లు, ఏటసి సెంటర్ ప్రత్యామ్నాయరోడ్లు 960 కోట్లు, **ఎల్బీనగర్ జోన్:** రూ. టికెఆర్ కాలేజ్, గాయత్రినగర్, మందనుల్లారెడ్డి కూడళ్ళలో ఫ్లైఓవర్లు రూ.416 కోట్లు,

**చార్మినార్ జోన్లో..**
ఓవైసీ హాస్పిటల్ వద్ద ఫ్లైఓవర్ సంతోష్ నగర్ ర్యాంప్, హఫీజాబాబానగర్ కూడలి నుంచి బాలాపూర్ చర్చ్ రోడ్ కూడలి వరకు బిడైరెక్షనల్ గ్రేడ్ సెపరేటర్, బండ్లగూడ ఎర్రకుంటల మధ్య ఫ్లైఓవర్ . 339 కోట్లు, మైలార్‌దేవులపల్లి, శంషాబాద్ రోడ్, కాటేదాన్ కూడళ్ళలో గ్రేడ్ సెపరేటర్ రూ. 200, ఆరాంఘర్ కూడలి వద్ద ఆర్‌వోబిల రూ.59 కోట్లు, బాలాపూర్లో రోడ్డుకు, చాంద్రాయణగుట్ట కూడలి, బర్కాస్ మీదుగా పోలీసు స్టేషన్ వరకు, హాఫీజా బాబానగర్ జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయం మీదుగా పూటాగ్, తనకుల్ మెడికల్ వరకు, తులసీనగర్ గౌస్‌నగర్ వరకు రోడ్ల విస్తరణ అభివృద్ధికి రూ. 320 కోట్లు, శాస్త్రిపురం నుంచి ఎన్‌హెచ్ బెంగళూరు వరకు, శాస్త్రిపురం నుంచి ఇంజిన్ బౌలి వరకు రోడ్డు విస్తరణ అభివృద్ధికి రూ.543 కోట్లు నిర్మణ పను లు, రోడ్ల విస్తరణ అభివృద్ధి పనులు నేటి శంకుస్థాపనల్లో ఉన్నాయని అధికారులు వెల్లడించారు.

# సంరక్షణ కేంద్రంలోని పిల్లలకు వారంలో ధృవపత్రాలు జారీ చేయాలి

**-వారి ఆరోగ్య పరిరక్షణకు వైద్యాధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలి**
**-హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



శిశువిహార్‌లో చిన్నారితో కరచాలనం చేస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 2,ప్రభాతవార్త:**
జిల్లాలోని అన్ని ఎన్జీవో, శిశు విహార్ సంరక్షణ కేంద్రాలలోని పిల్లలకు జనన, కుల, ఆదాయ, ఇతర ధ్రువీకరణ పత్రాలను వారం రోజుల్లోగా అందజేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. ఈమేరకు సోమవారం హైదరాబాద్ మధుర నగర్ శిశు విహార్ సంరక్షణ కేంద్రంలో ఎన్జీవో, శిశు విహార్ లోగల పిల్లలకు బర్త్, ఇన్‌కమ్, కుల, ఇతర ధ్రువీకరణ పత్రాల జారీ కై ఏర్పాటుచేసిన ప్రత్యేక క్యాంపును కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా 8 నెలల బాలికకు బర్త్ సర్టిఫికెట్ ను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాతూ జిల్లాలోని అన్ని ఎన్జీవో సంస్థల, శిశు విహార్ సంరక్షణ కేంద్రంలోని పిల్లలందరికీ వారం రోజుల్లోగా ప్రత్యేక క్యాంపు ద్వారా వివిధ రకాలైన జనన, కుల, ఆదాయ, ఇతర ధ్రువపత్రాలను అందించాలని ఆదేశించారు. సంరక్షణ కేంద్రంలోని పిల్లలకు పౌష్టిక ఆహారం అందించాలని, వైద్యులు పిల్లల ఆరోగ్య పరిరక్షణకై నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం చేయకుండా పిల్లల బాగోగులు చూడాలని అన్నారు. సంరక్షణ కేంద్రాలలోని పిల్లల యొక్క తల్లిదండ్రులు చనిపోతే వారి ఆస్తిపాస్తులు పిల్లలకు చెందేలా రెవెన్యూ శాఖకు వివరాలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు, సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరాం, డిసిపిఓ శ్రీనివాస్, తహసీల్దార్ నయీమ్ ఉద్దీన్, సిడిపిఓ, ఐసిడిఎస్ బాల రక్ష భవన్ కోఆర్డినేటర్ సుమలత, యూనిసెఫ్ స్టేట్ కోఆర్డినేటర్ డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

# గల్బలగూడ ఉన్నత పాఠశాలలో వసతులు కల్పించాలి



గల్బలగూడ ప్రభుత్వ పాఠశాల దుస్థితి

**యాకుత్‌పుర,డిసెంబరు 2 ప్రభాతవార్త :**
బహదూర్‌పుర అసెంబ్లీ నియోజకవర్గం, తాడ్‌బన్‌లో ఉన్న గల్బలగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల,ప్రభుత్వ ప్రైమరీ పాఠశాల భవనం దీనస్థితికి చేరుకుంది. ప్రైమరీ పాఠశాలలో 256 మంది విద్యార్థులు ఉన్నత పాఠశాలలో 364 మంది విద్యార్థులు చదువు చున్నారు.గత సంవత్సరం జూలై నెల వరకు రెండు షిఫ్టులలో ప్రైమరీ,హైస్కూల్ నడిచేవి.ఆగష్టు నెల నుంచి హైస్కూల్, ప్రైమరీ పాఠశాల ఒకే షిఫ్టులో నడుస్తున్నాయి.అద్దె భవనంలో ఉన్న పాఠశాల భవనం అధ్వాన్నస్థితిలో ఉంది.భవనం రేకు కప్పులు నుంచి వర్షం కురుస్తున్న సమయంలో వర్షం నీరు కారుతుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు.విద్యార్థులకు సరిపడ్డ మరుగు దొడ్లు,బెంచీలు లేకపోవటంతో ఇబ్బందుల పాలవుతున్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి పాతబస్తీ గల్బలగూడలోని ప్రభుత్వ హైస్కూల్,ప్రైమరీ స్కూల్‌కు ప్రభుత్వ భవనాన్ని నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.గల్బలగూడ ప్రభుత్వ హైస్కూల్,ప్రైమరీ పాఠశాలలో వసతులు కల్పించాలని కోరుతూ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేశానని బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్ తెలిపారు.

# ప్రకాశంనగర్‌లో పర్యటించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్



స్థానికులతో సమస్యలను తెలుసుకుంటున్న కమీషనర్ రంగనాథ్

**బేగంపేట, డిసెంబర్ 2 ప్రభాతవార్త:** బేగంపేట ప్రకాశనగర్ స్లమ్ పరిసర ప్రాంతాల్లో హైడ్రా కమీషనర్ రంగనాథ్ సోమవారం పర్యటించారు. వెల్కిన్ పార్కు అపార్ట్‌మెంట్ సమీపంలో 1150 గజాల స్థలంలో రసాయన పదర్థాల పైపు లైన్ ఉందని స్థానికులు కొందరు ఫిర్యాదు చేయడంతో రంగనాథ్ ఆ ప్రాంతానికి చేరుకున్నారు. కమీషనర్ పరిసరాలను పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. బాలానగర్ నుంచి అంబర్‌పేట్‌కు వెళ్లుతున్న రసాయనాల వ్యర్థాలు నాలాపై కొందరు షెడ్లతో తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారనే ఫిర్యాదుతో రంగనాథ్ ఈ ప్రాంతానికి చేరుకొని స్థానికులతో మాట్లాడారు. స్థానికులు కొందరు తాము చట్టబద్ధంగానే ఉన్నామని తమకు అన్ని అనుమతులు ఉన్నాయంటూ రంగనాథ్‌కు వివరించారు. తగిన ఆధారాలు కల్గిన పత్రాలను తమ కార్యాలయానికి పంపాలని రంగనాథ్ స్థానికులకు సూచించారు. నాలాపై ఆక్రమణల విషయంలో గతంలో కూడా కొందరికి జీహెచ్‌ఎంసీ నోటీసులు జారీ చేయడం గమనార్హం.రసాయనాల పైపు లైన్ నాలాపై ఆక్రమణలపై కమీషనర్ ప్రకాశనగర్‌లో పర్యటించారు. ఆయన వెంట వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బండ్లగూడలో ఘనంగా ప్రజాపాలన విజయోత్సవాలు



కాళీమందిర్ నుంచి బండ్లగూడ చౌరస్తా వరకు ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న మేయర్, కమీషనర్, కార్పోరేటర్లు.

**నార్సింగి, డిసెంబర్ 2 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలో "ప్రజాపాలన విజయోత్సవాలు" ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం కాళీమందిర్ నుంచి బండ్లగూడ చౌరస్తా వరకు జరిగిన ర్యాలీని మేయర్ లతాగౌడ్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో కమీషనర్ శరత్‌చంద్ర, కార్పోరేటర్లు సాగర్‌గౌడ్, అస్లాం, చంద్రశేఖర్, రవీందర్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, రాము, నోడల్ అధికారులు, ఆర్‌పిలు, సూపర్‌వైజర్లు, శానటరీ జవాన్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమీషనర్ శరత్‌చంద్ర ప్రజా ప్రతినిధులు, అధికారులు అందరితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మేయర్ లతాగౌడ్ మాట్లాడుతూ ఎన్నికల వేళ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను సీఎం రేవంత్‌రెడ్డి పకడ్బందీగా అమలు చేస్తున్నారన్నారు. బండ్లగూడ కార్పోరేషన్‌లో మౌళిక వసతుల కల్పనకు పెద్దపీఠ వేయడం జరిగిందన్నారు. భూగర్భ డ్రైనేజీ, మంచినీటి సమస్య, సీసీ రోడ్లు, వీధి దీపాలు వంటి మౌళిక వసతులను 99.శాతం పూర్తి చేశామని మేయర్ లతాగౌడ్ వివరించారు.

**మణికొండలో :** మణికొండ మున్సిపాలిటీలో సైతం సోమవారం ప్రజాపాలన విజయోత్సవాలు జరిగాయి. గోల్డెన్ టెంపుల్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు 2.కే.రన్‌ను నిర్వహించారు. అధికారులు, స్థానికులు, ప్రజా ప్రతినిధులంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం పారిశుద్య సిబ్బందిని, మున్సిపల్ కార్యాలయ సిబ్బందిని పాలకవర్గ సభ్యులు ఘనంగా సత్కరించారు. ప్రధానమంత్రి స్వనిధి ద్వారా వీధి వాపారులకు, పొదుపు సంఘాల మహిళలకు వ్యక్తిగత రుణాలు పంపిణీ చేశారు. మున్సిపల్ కార్యాలయ సిబ్బందికి భూమి ఆసుపత్రి, శంకర కంటి ఆసుపత్రి వైద్యులు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులు పంపిణీ చేశారు. మహాత్మాగాంధీ పార్కులో మహిళా సంఘాల సభ్యులు వివిధ సాంస్కృతి కార్యక్రమాలను నిర్వహించారు.

# జిహెచ్‌ఎంసి ప్రజావాణికి 132 దరఖాస్తులు

**హైదరాబాద్, డిసెంబర్ 2, ప్రభాతవార్త:**
జీహెచ్‌ఎంసి వ్యాప్తంగా సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో హెడ్ ఆఫీస్, ఆరు జోన్లలో కలిపి మొత్తం 132 ఫిర్యాదులు అందాయి. ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కమీషనర్లు పాల్గొని పలు సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ప్రజావాణి ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా 6 విన్నపాలు రాగా, పరిష్కారం నిమిత్తం ఆయా విభాగాలకు పంపించడం జరిగింది.జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో 38 విన్నపాలు రాగా అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 17, ఎ.సి రెవెన్యూ, ఏ.సి అడ్మిన్ లకు నాలుగు చొప్పున, సి.ఇ మెయింటెనెన్స్, వెటర్నరి, ఎల్.ఏ.ఓ 3 చొప్పున, శానిటేషన్, హెల్త్, యు.బి.డి సి.ఇ ప్రాజెక్ట్ ఒకటి చెప్పున విన్నపాలు అందాయి. జిహెచ్‌ఎంసి పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 94 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్ పల్లి జోన్ లో 65, ఎల్బీనగర్ జోన్ లో 10, సికింద్రాబాద్ జోన్ లో 8, శేరిలింగంపల్లి జోన్ లో 7, ఖైరతాబాద్, చార్మినార్ జోన్లలో రెండు చొప్పున ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు, నళిని పద్మావతి, గీతా రాధిక, పంకజ, రఘు ప్రసాద్, సుభద్ర దేవి, చంద్రకాంత్ రెడ్డి, యాదగిరి రావు, సిసిపి శ్రీనివాస్, అడిషనల్ సిసిపి ప్రదీప్ కుమార్ ఆయా విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్, శివకుమార్‌నాయుడు తదితరులు

# ఆ ఫ్యామిలీ ఏమైనట్లు..?

## హాస్పిటల్‌కు వెళ్లారు..తిరిగి రాలేదు



**హైదరాబాద్, డిసెంబరు 2 ప్రభాతవార్త**
గర్భిణీగా ఉన్న భార్యతో పాటు ఇద్దరు పిల్లలతో ఆసుపత్రికి వెళ్లిన ఓ వ్యక్తి కుటుంబంతో సహా అదృశ్యమైన ఘటన బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దీనిపై అతడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివరాల్లోకి వెళితే ఓల్డ్ బోయిన్‌పల్లి బడాగూడకు చెందిన అహ్మద్ బేగ్ (30), భార్య సనా సుల్తానా (28), పిల్లలు అర్హాన్ (4), జకియా (9 నెలలు)లతో కలిసి జీవనం సాగిస్తున్నాడు.అహ్మద్ బేగ్ ఉమ్మడి కుటుంబంగా ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం అహ్మద్ బేగ్ భార్య సనా సుల్తానా ఆరు నెలల గర్భిణీ. ఆమె కొద్ది రోజులుగా ఓల్డ్ బోయిన్‌పల్లి మల్లికార్జున నగర్ కాలనీలోని పుట్టింట్లో ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. గత నెల 29న అహ్మద్ బేగ్ భార్యాపిల్లలను తన ఇంటికి తీసుకువచ్చాడు. కొద్దిసేపటికే భార్యకు వైద్య పరీక్షలు చేయించడానికి పిల్లలను వెంటబెట్టుకొని వెళ్లి ఎంతసేపటికీ తిరిగి రాలేదు. దీంతో అహ్మద్ బేగ్ కుటుంబసభ్యులు బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# సెల్ఫ్ డ్రైవ్ కార్ల పేరుతో మోసం

**-కార్లు అద్దెకు తీసుకొని కార్లను మాయం చేస్తున్న ముఠా**
**-సూత్రదారి మహిళ సహా మొత్తం నలుగురు అరెస్టు**
**- 21 కార్లు స్వాధీనం**



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న కార్లను పరిశీలిస్తున్న డిసిపి వినీత్ తదితరులు

**గచ్చిబౌలి, డిసెంబరు 2 ప్రభాతవార్త :** సెల్ఫ్ డ్రైవ్ కార్ల పేరుతో పలువురి వద్ద నుంచి కార్లను అద్దెకు తీసుకొని వాటిని మాయం చేస్తున్న ముఠాను రాయదుర్గం పోలీసులు అరెస్టు చేశారు. మాయం చేసిన కార్లను జిపిఎస్ తొలగించి ఇతర రాష్ట్రాల్లో అద్దెకు తిప్పుతున్నారు. వీరి భారిన పడి మొత్తం 21మంది అమాయకులు మోసపోయారు. ఈ మొత్తం కుట్రలో ఓ మహిళ సూత్రదారిగా గుర్తించిన పోలీసులు నలుగురుని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 21 కార్లను స్వాధీనం చేసుకున్నారు. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను సోమవారం డిసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిసిపి వినీత్ వెల్లడించారు... గచ్చిబౌలి టెలికాంనగర్‌లో నివాసం ఉండే జూపూడి ఉషా సులభంగా డబ్బు సంపాదించడం కోసం సెల్ఫ్ డ్రైవ్ కార్ల కుట్రకు పథకం వేసింది. ఇందులో భాగంగా షేక్‌పేటకు చెందిన తుడుముల మల్లేష్‌తో కలిసి సెల్ఫ్ డ్రైవ్ కార్లను అద్దెకు తీసుకుంటామంటూ సోషల్ మీడియా వేదికగా, తెలిసిన వారి వద్ద ప్రచారం చేసింది. వీరి ప్రచారం నమ్మిన పలువురు తమ సొంత కార్లను వీరికి రోజువారి అద్దె కోసం అందజేశారు. వాటిని బీదర్ నుంచి నగరానికి వచ్చి అత్తాపూర్‌లో ఉంటున్న సాగర్ పాటిల్, బీఖ్లీ నుంచి వచ్చి అత్తాపూర్‌లో ఉంటున్న జమానే అనీల్‌కుమార్‌లకు ఇచ్చి వాటిని రాష్ట్రాలు దాటిస్తున్నారు. అక్కడ కార్లకు ఉన్న జిపిఎస్‌ను తొలగించి కర్ణాటక, మహారాష్ట్ర తదితర పక్క రాష్ట్రాల్లో అద్దెకు తిప్పుతున్నారు. కార్ల యజమానుల వద్ద నుంచి కార్లను రోజు వారి అద్దె కోసం తీసుకుంటున్న ఉషా, మల్లేష్‌లు ఒక్కో కారు మీద తమ కమీషన్ తీసుకొని వాటిని సాగర్, అనీల్‌కుమార్‌లకు అందజేస్తున్నారు. అసలు కార్ల యజమానులు ఉషను తమ కార్ల కోసం ప్రశ్నిస్తే చోరీకి గురయ్యాయని, కనిపించకుండా పోయాయంటూ మాయమాటలు చెప్పసాగింది. పలువురి వద్ద నుంచి కార్లను తీసుకున్న నాటి నుంచి మొబైల్ నెంబరు మార్చి, అందుబాటులో లేకుండా తిరుగుతునా న్నరు. వీరి చేతిలో మోసపోయిన పలువురు బాధితులు రాయదుర్గం పోలీసులను ఆశ్రయించాగా, కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపడితే మొత్తం కుట్ర బయటపడింది. ఉషా, మల్లేష్, సాగర్, అనీల్‌లను అరెస్టు చేసిన పోలీసులు వారి వద్ద నుంచి 2.50 కోట్ల రూపాయల విలువైన 4 మహేంద్రా థార్, 10 మారుతీ ఎర్టిగా, 1ఇన్నోవా, 3మారుతీ స్విఫ్ట్, 1హ్యుందాయ్ వెన్యూ, 1 హ్యుందాయ్ ఐ20, 1 గ్రాండ్ ఐ10కార్లను స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులను రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో మాదాపూర్ ఏడిసిపి జయరాం, ఏసిపి శ్రీకాంత్, రాయదుర్గం ఇన్స్‌పెక్టర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## శివాలయంలో వైభవంగా అన్నపూజా మహోత్సవం



పూజలు నిర్వహిస్తున్న గాంధీనగర్ కార్పొరేటర్ పావనీ వినయకుమార్

**చిక్కడపల్లి, డిసెంబరు 2 ప్రభాతవార్త:** ఆర్టీసిక్రాస్‌రోడ్స్ శ్రీలక్ష్మీగణపతి దేవాలయంలో శివాలయంలో కార్తీకమాసం చివరి రోజు మహాశివుడి ఉపాలయంలో స్వామి వారికి అన్నాభిషేక మహోత్సవం నేత్రపర్వంగా సాగింది. గాంధీ నగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమూర్ దంపతులు స్వామి వారికి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్పొరేటర్ దంపతులకు తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## ఘంటసాల గుడికి అపురూప చిత్రం అందజేత

**చిక్కడపల్లి, డిసెంబరు 3 ప్రభాతవార్త:** చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో విఖ్యాతనటులు అక్కినేని నాగేశ్వరరావు నందమూరి తారకరామారావులతో ప్రఖ్యాత గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరావు కలిసి ఉన్న చిత్రపటాన్ని ఘంటసాల దేవాలయం ధర్మకర్త వంశీ రామరాజుకు ప్రముఖ గాయకుడు గంటి రామ కృష్ణ అందించారు. అమర గాయకుడు ఘంటసాల జయంతి సందర్భంగ అపురూప చిత్రపటం అందించారు.

### ఎయిడ్స్ మహమ్మారిపై విద్యార్థులకు అవగాహన ఉండాలి

-డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ విష్ణుప్రియ




ఎయిడ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి, డిసెంబరు 3 ప్రభాతవార్త:** ప్రాణాంతకమైన ఎయిడ్స్ మహమ్మారి బారినపడకుండా విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ విష్ణుప్రియ అన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఎయిడ్స్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హ్యూమన్ ఇమ్యునిటీ డిఫిషియన్సీ(హెచ్ఐవి) శరీరం రోగనిరోధక వ్యవస్థపై దాడి చేసే వైరస్ నివారణ వాస్తవాలను, ప్రమాదాల అంచనాలను, పరీక్షలప్రాముఖ్యతను వివరించారు. హెచ్ఐవి బారినపడ్డ వ్యక్తులపై వివక్షత చూపకుండా వారిస్థితిగతులను అర్థం చేసుకోవాలన్నారు. ప్రతిరోజు వస్తున్న నివేదికలతో చికిత్సతో నిర్వహణ పాలనతో అవగాహన కలిగించి ఆధారాలను అడ్డంకుడాలను తొలగించే ప్రయత్నం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, అధ్యాపకులు, ప్రోగ్రామ్ ఆఫీసర్‌లు, వైస్‌ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

### అబాకస్ విద్యతో పిల్లల్లో మేధా శక్తి పెరుగుతుంది : ప్రొ పురుషోత్తం



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో వైస్ చెర్మన్ ప్రొ.ఇటికాల పురుషోత్తం

**తార్నాక, డిసెంబర్ 2 ప్రభాతవార్త:** అబాకస్ విద్యతో పిల్లల్లో మేధా శక్తి పెరుగుతుందని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చెర్మన్ ప్రొ.ఇటికాల పురుషోత్తం పేర్కొన్నారు. సికింద్రాబాద్ హర్యాన భవన్‌లో యూసీమస్ 8వ అబాకస్ కాంపిటేషన్ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఈ పోటీలు తార్నాక యూసీమస్ అబాకస్ బ్రాంచ్ సెంటర్ ఇంచార్జి శోభారాణి ఆధ్వర్యంలో కూడా నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చెర్మన్ ప్రొ.ఇటిక్యాల పురుషోత్తం పాల్గొని అబాకస్ విద్య ఉపయోగాల గురించి మాట్లాడారు. అబాకస్ అధ్యాపకురాలు శోభారాణి మాట్లాడుతూ చిన్న వయసు ఉన్న పిల్లలకు తమ సెంటర్‌లో యూసిమస్ ద్వారం ఉత్తమ శిక్షణనిస్తున్నామని చెప్పారు. మలేషియాతో పాటు 82 దేశాల్లో ఫ్రాంచైజ్ నెట్‌వర్క్‌తో కూడిన గ్లోబల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. అనంతరం పోటీల్లో అత్యుత్తమ ప్రతిభకనబర్చిన విద్యార్థులకు చాంపియన్స్ మెమొంటోస్, రన్నర్ ఆఫ్స్‌కు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కోఆర్డీనేటర్ శ్రీరాం శివకుమార్, సుభాష్‌తో పాటు యూసిమస్ రాష్ట్ర ఇంచార్జి మెహర్ చైతన్య తధితరులు పాల్గొన్నారు.

## మాజీ ముఖ్యమంత్రి రోశయ్య వర్ధంతి సభ విజయవంతం చేయాలి

### -సభ మీడియా కోఆర్డినేటర్ కౌటికె విఠల్

**హైదరాబాద్, డిసెంబరు 2,ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి, వైశ్య జాతి శిఖామణి కొణిజేటి రోశయ్య వర్ధంతి సభను విజయవంతం చేయాలని సభ మీడియా కోఆర్డినేటర్, వైశ్యసంఘం నేత కౌటికె విఠల్ పిలుపునిచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన మన వైశ్యజాతి రత్నం రోశయ్య సేవలు ఎనలేనివని ఆయన పేర్కొన్నారు. అజాతశత్రువుగా పేరొందిన రోశయ్య ఒక్క వైశ్యులకే కాకుండా అన్ని వర్గాల వారికి ఆరాధ్య దైవమని విఠల్ చెప్పారు. ఆయన మరణించినా ఆయన సేవలు మాత్రం ఎప్పటికీ మర్చిపోలేనివన్నారు. చైతన్య స్ఫూర్తిమహాశయా రోశయ్య పేరిట ఈ నెల 4న హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహించే వర్ధంతి సభకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత తదితర వైశ్య ప్రముఖులు, రాజకీయ పార్టీల నేతలు కూడా హాజరవుతారని తెలిపారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సభకు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన వైశ్యులందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. వచ్చిన వారందరికీ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజన సౌకర్యం కల్పించామని, దూర ప్రాంతాల నుంచి బస్సులు కూడా ఏర్పాటు చేశామని కౌటికె విఠల్ పేర్కొన్నారు. వైశ్యులంతా తరలివచ్చి వైశ్య మహానేత రోశయ్యకు ఘనంగా నివాళులర్పించాలని ఆయన కోరారు.

### ఢిల్లీలో 11న ఓబిసిల జాతీయ సదస్సు, 12న ధర్నా

**సైఫాబాద్, డిసెంబరు 2 ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టాలని, ఇతర సామాజిక న్యాయ సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో ఈ నెల 11న ఓబిసిల జాతీయ సదస్సు, 12న ధర్నా నిర్వహిస్తున్నామని బిసి ఇంటలెక్చువల్స్ ఫోరం తెలిపింది. ఈ మేరకు సోమవారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫోరం ఛైర్మన్ టి.చిరంజీవులు ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. అన్ని రంగాలలో బిసిల జనాభా ప్రకారం రిజర్వేషన్‌లు కల్పించాలని, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులవలే బిసిలకు ప్రమోషన్లలో రిజర్వేషన్‌లు కల్పించాలని, ఆదే విధంగా బిసిలకు బ్యాక్‌లాగ్ ఖాళీలను పూర్తి చేయాలని, ఓబిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిసి నేతలు సూర్యారావు, బత్తుల సిద్ధేశ్వర్, అవ్వారు వేణు, చామకూర రాజు, కె.వి.గౌడ్ పాల్గొన్నారు.

## కళాకారుల ప్రతిభ శాశ్వతం : ప్రవచకుడు వెంకట్ గరికపాటి



మణిశాస్త్రి సహగాయకులతో వెంకట్ గరికపాటి, చంద్రశేఖర్, తులసీరాం తదితర అతిథులు

**నాంపల్లి, డిసెంబరు 2 ప్రభాతవార్త :** కళాకారులు తమ ప్రతిభాపాటవాలతో సమాజంలోని ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచే ఉంటారని ప్రముఖ అన్నమయ్య కీర్తనల వ్యాఖ్యాన ప్రవచకుడు, ఎస్‌బిఐ మాజీ డిజీఎం వెంకట్ గరికపాటి అన్నారు. విశ్వవిఖ్యాత గాయని వాణీజయరాం తొలి తెలుగుపాటట పాడి 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో శ్రీరామ సాంస్కృతిక సంస్థ, నాదవినోద సంగీత అకాడమీ, అమెరికా సంయుక్త నిర్వహణలో వాణీజయరాం పాడిన పలుపాటలు అమెరికా స్థిరపడిన మణిశాస్త్రి సహగాయకులు పవన్, శ్రీకాంత్, హర్ష, సంపత్‌లతోపాటు సింధుచరిత, గాయత్రి, చందన, రవళి తదితరులతో కలిసి సుమధురంగా ఆలపించి ఆహుతులకు వీనులవిందు కావించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వెంకట్ గరికపాటి అమెరికా గానకోకిల మణిశాస్త్రి అని అభివర్ణించారు. శ్రీరామ సంస్థ చంద్రశేఖర్ నిర్వహణాధ్యక్షుడని ప్రశంసించారు. ప్రముఖ గాయకుడు, సంగీత దర్శకుడు కె.రామాచారి మాట్లాడుతూ స్వయంగా గాయని అయిన మణిశాస్త్రి సహగాయకులను భారతదేశం నుండి అమెరికా రప్పించి, ఆతిథ్యం, వేదికను అందించి వారి ప్రతిభనూ చాటుకోడానికి అవకాశమివ్వడం మణిశాస్త్రి సహృదయతకు నిదర్శనమని కొనియాడారు. కార్యక్రమాన్ని సంస్థ అధ్యక్షుడు గొర్తి చంద్రశేఖర్ పర్యవేక్షించారు.

## ఎబిసిడి వర్గీకరణ అమలు అయ్యేంతవరకు నిరంతరం పోరాటం



సమావేశంలో పాల్గొన్న విశ్రాంత ఐఆర్‌టిఎస్ అధికారి భరత్‌భూషణ్, మిద్దెపాక రవీందర్, పల్లెల వీరాస్వామ తదితరులు

**చిక్కడపల్లి, డిసెంబరు 2 ప్రభాతవార్త:** ఏ రాజకీయ పార్టీలో ఉన్నా, ఏ ప్రజా సంఘంలో ఉన్నా మాదిగ జాతి అంతా ఐకమత్యంతో ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని మాదిగల ఐక్య సంక్షేమ సంఘం(మాస్) ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి విస్తృత స్థాయి సమావేశం అభిప్రాయపడింది. సోమవారం బాగ్‌లలింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మిద్దెపాక రవీందర్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా విశ్రాంత ఐఆర్‌టిఎస్ అధికారి భరత్ భూషణ్ హాజరు కాగా సమావేశంలో బంధ్‌సొసైటీ అధ్యక్షుడు పల్లెల వీరాస్వామి, విశ్రాంత ప్రొఫెసర్‌లు పి.ముత్తయ్య, ప్రొఫెసర్ నతానియేలు, ఓఎన్‌జీసీ విశ్రాంత డీజీఎం ఇ.విజయపాల్, హైకోర్టు విశ్రాంత పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముత్యాల మురళీధర్, వి.నర్సింహా, అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జన్ను నర్సయ్య, మాస్ రాష్ట్ర అధ్యక్షుడు జన్ను రాములు, సోషల్ జస్టిస్ ఫోరం ప్రతినిధి గ్యార శ్రీనివాస్, విసికె పార్టీ అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్, జంగిరి భాస్కర్, ఇమ్మడి పవిత్రన్, ఎం.అంజన్న, ఎం. ఎల్లయ్య, సి.రవిమాదిగ, బీరెల్లి రాము మాదిగ, సంకినేని జయరాజు తదితరులు పాల్గొన్నారు. పార్టీలకు, సంఘాలకు అతీతంగా మాదిగ జాతిని ఏకం చేయడం, ఏబిసిడి వర్గీకరణ అమలు అయ్యేంతవరకు నిరంతరం పోరాటం చేయాలని సమావేశం పలుపునిచ్చింది. గూడులేని పేదలందరికి ఇంటటి స్థలంతో పాటు ఇంటటి నిర్మాణం చేపట్టే వరకు పోరాటం చేయాలని, విద్యాహక్కు చట్టం అమలు చేయాలని, యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తూ ఎస్సీకార్పొరేషన్ ద్వారా రుణలివ్వాలని, కార్పొరేట్ స్థాయిలో ఉచిత విద్య, వైద్యం అందించాలని, ప్రైవేట్ కంపెనీలలో రిజర్వేషన్ కల్పించాలని సమావేశం డిమాండ్ చేసింది. మాదిగ జాతి అంతఆ ఐక్యంగా ముందుకు సాగడంతో పాటు బలోపేతం కావడానికఆ, రాష్ట్రవ్యాప్తంగా విస్తరించడానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మన జాతి ఐక్యతను మరింత పెంచుకోవడానికి, బలమైన శక్తిగా రూపాంతరం చెందడానికి, రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించడానికి సమావేశాలను నిర్వహించడం జరిగిందన్నారు. ముఖ్యంగా మాదిగ జాతి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందే విధంగా క్షేత్రస్థాయి నుంచి జాతిని బలోపేతం చేయడం కోసం భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సమావేశం నిర్ణయించింది. మాదిగ జాతి పక్షాన పోరాడేందుకు, జాతిని ఐక్యం చేసేందుకు, సంఘం ఏర్పాటైందని, సంఘం ఏర్పాటైన నాటినుంచి అనతికాలంలోనే రాష్ట్రలో ఉనికిని చాటుకుందని, ఇందులో భాగంగానే సంఘాన్ని విస్తరింపచేదానికి కృషి చేస్తున్నట్లు వివరించింది.

## రచయితకు కాలానుగుణ అధ్యయనం అవసరం



రచయిత వెంకటకృష్ణకు 4 ప్రపంచ రికార్డులను అందజేస్తున్న జస్టిస్ సత్యనారాయణమూర్తి, కె.వి.రమణారావు, సుబ్బారావు తదితర అతిథులు

**రవీంద్రభారతి, డిసెంబరు 2 ప్రభాతవార్త :** సాహిత్యానికి సామాజిక ప్రయోజనంతోపాటు మారుతున్న కాలానికి అనుగుణంగా చోటుచేసుకుంటున్న పరిణామాలను నిశిత దృష్టితో అధ్యయనం చేయాల్సిన అవసరం రచయితకు ఉందని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎం.సత్య నారాయణమూర్తి అన్నారు. ఆ లక్ష్యం నిబద్ధత ఉంది కాబట్టి మాధవ తన అంతరంగాన్ని సమాజ దృక్పథాన్ని విశ్లేషిస్తూ ధార్మికంగా సామాజికంగా తన బాధ్యతను నిర్వహించారని అభినందించారు. షిరిడీసాయి గానయజ్ఞం పేరిట సాయిబాబా 108 పాటలను రచించి ప్రతీవారం ఒకపాట వీడియోను యూట్యూబ్‌లో 108 వారాలపాటు 108పాటల వీడియోలను పొందుపరిచినందుకుగాను కైవసం చేసుకున్న 4 ప్రపంచ రికార్డులను రచయిత మాధవ వెంకటకృష్ణకు ప్రపంచ రికార్డుల ప్రతినిధి లయన్ కె.వి. రమణారావు సమక్షంలో జస్టిస్ అందజేసి శుభాభినందనలు తెలిపారు. వృత్తిరీత్యా న్యాయవాది అయినా ప్రవృత్తిరీత్యా సాహిత్య, కళాభిమాని అయిన కోసూరు మాధవ వెంకటకృష్ణ రచించిన రెండు పుస్తకాలు షిరిడిసాయి గాన యజ్ఞము పాటల, నాలోనేను కవితా సంపుటిలను రవీంద్ర భారతిలోని సమావేశ మందిరంలో ముఖ్యఅతిథిగా జస్టిస్ పాల్గొని పుస్తకాలను ఆవిష్కరించారు. ప్రపంచ తెలుగు రచయితల సంఘాధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా విశ్రాంత న్యాయమూర్తులు నాయుడు నాగరాజు, చింత్యాల హేమంత్‌కుమార్‌లు, దైవజ్ఞశర్మ, అన్నవరపు బ్రహ్మయ్య, ఆత్మకూరు రామకృష్ణ, బడే ప్రభాకర్, ఓంప్రకాష్ నారాయణ, హనుమంతరావు తదితరులు పాల్గొని రచయిత మాధవ వెంకటకృష్ణను ఘనంగా సత్కరించి మరిన్ని మంచి రచనలు ఆయన కలంనుండి జాలువారాలని ఆకాంక్షించారు.

## పోటీలు విద్యార్థులలో ప్రతిభను ఇనుమడింపచేస్తాయి



ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలలో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న ముదిరాజ్ కార్పోరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్.

**నార్సింగి, డిసెంబర్ 2 ప్రభాతవార్త :** పోటీలు విద్యార్థులలో ప్రతిభను ఇనుమడింపజేస్తాయని రాష్ట్ర ముదిరాజ్ కార్పోరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పేర్కొన్నారు. గండిపేట మండల పరిధిలోని హైదర్షాకోట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఇఓ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని పదో తరగతి విద్యార్థులకు "పునరుత్పాదక ఇంధన వనరులు" అనే అంశపై వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. నార్సింగి, మణికొండ, వట్టినాగులపల్లి, కోకాపేట్, హైదర్షాకోట్, కేజీవిపి, కస్మిత్‌పూర్ పాఠశాలలకు చెందిన 121.మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ముఖ్య అతిథిలు జ్ఞానేశ్వర్ ముదిరాజ్, బండ్లగూడ కార్పోరేషన్ మేయర్ మద్దెల లతా ప్రేమ్‌గౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, ఎంఇఓ విజయ్ కుమార్, కార్పోరేషన్ కమీషనర్ శరత్‌చంద్రలు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంలో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం అనేక సంస్కరణలు తీసుకువచ్చిందన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేసి మహిళలు, రైతులు, నిరుద్యోగుల కళ్లల్లో సంతోషంను నింపిందని వివరించారు. విద్యా, ఉద్యోగ, ఉపాధి,రైతు, యువత, మహిళలు లబ్దిపొందే అనేక సంక్షేమ పతకాలు అమలు చేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి గత పాలనలో ధ్వంసమైన వ్యవస్థలను గాడిలో పెట్టి ప్రజారంజకమైన పాలన చేస్తున్నారని వివరించారు. ప్రభుత్వ బడుల్లో కార్పోరేట్ సాయి విద్యను అందించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సైదిరెడ్డి, సునిల్ కుమార్, నిరంజన్, భూపాల్‌రెడ్డి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

### టిక్కెట్ల ధరలను నియంత్రించి, చలనచిత్ర రంగాన్ని కాపాడాలి

టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు సాయిబాబా



సమావేశంలో ప్రసంగిస్తున్న టి.సాయిబాబా

**ముషీరాబాద్, డిసెంబర్ 2, ప్రభాతవార్త:** సామాన్యులకు అందని రీతిలో పెరిగిపోతున్న సినిమా టిక్కెట్ ధరలను నియంత్రించి, చలనచిత్ర రంగాన్ని కాపాడాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. సోమవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాన్యులకు అందుబాటులో ఉండే వినోదం సినిమాలు మత్రమేనని, అటువంటి సినిమా టిక్కెట్ ధరలను ఇష్టానుసారంగా పెంచుకోవడానికి ప్రభుత్వం జీవోలు జారీ చేయటం విచారకరమని అన్నారు. ఎవరో ఇచ్చే ముడుపుల కోసం ఆశపడి ప్రజల మీద బలవంతంగా టిక్కెట్ల పెంపు రుద్ది, సామాన్యులకు సినిమా వినోదాన్ని దూరం చేయటం ఏం న్యాయమని ప్రశ్నించారు. సామాన్యులకు సినిమాలను దూరం చేయాలనే కుట్రలు జరుగుతున్నాయని, వెంటనే ఈ జీవోలను రద్దు చేసి, చలనచిత్ర రంగాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ సమావే శంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, ఎస్. ప్రకాష్, యాదగిరి రావు, మేడిపల్లి శ్యాంసుందర్, సుక్రవేది పాల్గొన్నారు.

## డిప్యూటి సిఎంను కలిసిన పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్

**హైదరాబాద్, డిసెంబరు 2,ప్రభాతవార్త:** తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్కను కలిశారు. ముఖ్యంగా జెన్‌కోలో న్న ప్రధాన సమస్యలు లను ఆయనతో చర్చించారు. ప్లాంట్లలో సుదీర్ఘ సేవలు అందిస్తున్న వారికి ఇప్పటివరకు బదిలీ చేపట్టకపోవడం, పలువురు ఇంజనీర్లకు ప్రమోషన్లు ఇచ్చినా వారికి పోస్టింగ్‌ల విషయంలో తీవ్ర ఆలస్యం,అలాగే కొత్తగా నియమితులవుతున్న అసిస్టెంట్ ఇంజనీర్ల కోసం పోస్టింగ్ ఆదేశాలు జారీ చేయడానికి మేనేజ్‌మెంట్ ప్రణాళిక సిద్ధం చేయడం, జెన్కో లో సాధారణ బదిలీలకు సంబంధించి ఎటు వంటి మార్గదర్శకాలు ఇవ్వకుండా తీవ్ర ఆలస్యం జరుగుతుంది గడిచిన మూడు సంవత్సరాల నుండి సాధారణ బదిలీ చెయ్యక పోవడం వలన ఇంజనీర్లు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని భట్టిదృష్టికి తీసుకెళ్ళారు ఈ విషయం పై సానుకూలంగా స్పందించిన డిప్యూటీ సిఎం అధికారులకు తగిన సూచనలు చేశారని అసోసియేషన్ అధ్యక్షులు రత్నాకర్ రావు, సెక్రటరీ జనరల్ సదానందం తెలిపారు.

# అంబర్‌పేటలో పిల్లికి అంత్యక్రియలు

### -21 ఏళ్లుగా పెంచుకున్న పిల్లి మృతి



**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త :** అల్లారు ముద్దుగా పెంచుకున్న పిల్లి (అలియాస్ పొట్టి) మృతి చెందింది. దీని వయస్సు 21 ఏళ్లు. దేశంలో పిల్లుల జీవితకాలం 14 నుంచి 16 ఏళ్లు మాత్రమే. కానీ ఈ పొట్టి 21 ఏళ్లు జీవించి రికార్డు నెలకొల్పింది. అంబర్‌పేట డివిజన్ పటేల్‌నగర్, రాజయ్య వీధిలో నివాసముంటున్న జూలూరు పుండరీ చారి, శ్రీదేవి కుటుంబం ఈ పిల్లిని పెంచుకున్నారు. 2004 సెప్టెంబర్ 19న ఈ పిల్లి జన్మించింది. ఇటీవలనే 20 ఏళ్లు పూర్తిచేసుకుని 21వ ఏట అడుగు పెట్టింది జన్మదిన వేడుకలు కూడా జరుపుకుంది. ఈ పిల్లి మలమూత్ర విసర్జన టాయిలెట్ లోనే పోతుంది. ఈ పొట్టి పాలతో పాటు చేపలు, చికెన్, ఐస్ క్రీమ్ ఇష్టంగా తింటుంది. ఇంటి యాజమానురాలు శ్రీదేవికి 2011 జూన్ 9వ తేదీ అర్ధరాత్రి చాతిలో నొప్పితో అవస్థలు పడుతుండగా పక్కనే ఉన్న ఈ పిల్లి గట్టిగా అరుస్తూ కుటుంబ సభ్యులను నిద్రలేపింది. శ్రీదేవిని 108 సర్వీస్ ద్వారా హైదర్ గూడ లోని అపోలో ఆసుపత్రికి తీసుకెళ్లగా గుండెపోటుగా వైద్యులు నిర్ధారించి స్టంట్ వేశారు. అలా..కుటుంబంలో ఒకరిగా ఉంటూ ఎంతో అల్లారు ముద్దుగా పెరిగిన ఈ పొట్టి తీవ్ర అస్వస్థకు గురువై సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు చనిపోయింది.దీంతో దీన్ని పెంచుకున్న కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. బంధువులు పొట్టి పార్థివ దేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం కాచిగూడ స్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

## 16లక్షల మంది విద్యార్థుల ఫీజుబకాయిలు వెంటనే చెల్లించాలి

### -బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య




విద్యార్థుల దీక్షలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య, వేముల రామకృష్ణ, నీలం వెంకటేష్ ,నందగోపాల్ తదితరులు

**హైద్రాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఇంజనీరింగ్,పీజీ,డిగ్రీ తదితర కాలేజీ కోర్సులు చదువుతున్న 16 లక్షల 75 వేలమంది బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనారిటీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజుల బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. విద్యార్థుల స్కాలర్‌షిప్ బిల్లులు చెల్లించాలకపోతే రాష్ట్రంలో తెలంగాణ ఉద్యమం తరహా మరో విద్యార్థి ఉద్యమం తధ్యం మని హెచ్చరించారు. ఈమేరకు సోమవారం బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు అధ్యక్షులు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యానగర్‌లోని బిసి భవన్ వద్ద విద్యార్థుల సామూహిక దీక్షా నిర్వహించారు. ఈ దీక్షకు వివిధ విద్యార్థి సంఘాలకు చెందిన నేతలు పెద్ద ఎత్తున హాజరై ఫీజుల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఫీజుల బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.కొందరు విద్యార్థులు రక్తాన్ని, కిడ్నీలను అమ్ముకొని బకాయిలు చెల్లించి సర్టిఫికెట్లు తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంలోని కొందరు అధికారులు ఫీజు రియంబర్స్ మెంట్ పథకాన్ని ఎత్తివేయడానికి కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ఫీజు రియంబర్స్ మెంట్ పథకం పెట్టిన ఈ 16సంవత్సరాల సమయంలో సమాజంలో పెద్ద ఎత్తున గుణాత్మకమైన పరిణామాలు జరిగాయి అన్నారు. సమాజంలో ఇతర మార్పు తెస్తున్న ఈ స్కీము ప్రభుత్వం నీరు కార్చే ప్రయత్నం చేస్తున్నట్లు విమర్శించారు. ప్రభుత్వం ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలు 4వేల కోట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ లేని పక్షంలో పెద్ద ఎత్తున రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈదీక్ష కార్యక్రమంలో నాయకులు, సుదాకర్ ముదిరాజ్, నీల వెంకటేష్, నందగోపాల్, సి.రాజేందర్, అనంతయ్య, రాందేవ్, బాలయ్య రాజు,అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

### ఆరాంఘర్-జూపార్కు ఫ్లైఓవర్ బ్రిడ్జికి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పేరు పెట్టాలి



రాష్ట్ర రవాణా,బిసి వెల్ఫేర్ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ ఇంఛార్జీ పులిపాటి రాజేష్ కుమార్

**చార్మినార్,నవంబరు 2 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ జూ పార్కు నుంచి ఆరాంఘర్ వరకు కొత్తగా నిర్మించిన ఫ్లైఓవర్ బ్రిడ్జికి భారత దేశ ప్రథమ ప్రధాన మంత్రి పండిట్ జవహర్‌లాల్ నామకరణం చేయాలని కోరుతూ రాష్ట్ర రవాణా,బిసి వెల్ఫేర్ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బహదూర్‌పుర నియోజ కవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్ వినతి పత్రం అందజేశారు.బహదూర్‌పురలో ఉన్న జూ పార్కు పేరు కూడ జవహర్ లాల్ నెహ్రూ జూలాజికల్ పార్కుగా ఉన్నదని,జూ పార్కు నుంచి ఆరాంఘర్ వరకు నిర్మించిన ఫ్లైవర్ బ్రిడ్జికి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ నామకరణం చేయాలని రాజేష్ కుమార్ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అంద జేసిన వినతి పత్రంలో పేర్కొన్నారు.ఈ విషయ మై మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాశారని పులిపాటి రాజేష్ కుమార్ తెలిపారు.

### మైనార్టీలు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలి

: చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ



కార్యక్రమంలో పాల్గొన్న చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ,సెయింట్ సులేమాన్ స్కూల్ కరస్పాండెంట్ మహ్మద్ మస్తాన్

**చార్మినార్,డిసెంబరు 2 ప్రభాతవార్త :** మైనార్టీలు అన్ని రంగాలలోను మరింత అభివృద్ధి సాధించవలసిన అవసరం ఎంతైనా ఉందని చార్మినార్ నియోజకవర్గం ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ అన్నారు.మర్కాజీ అంజుమన్-ఇ- ఖాద్రియా ఆధ్వర్యంలో జరిగిన దీని తాలీమీ ర్యాలీని ఆయన చారిత్రక మక్కామసీదు వద్ద ప్రారంభించారు. మక్కా మసీదు నుంచి కులీ కుతుబ్‌షా స్టేడియం వరకు ర్యాలీ కొనసాగింది.కుడా స్టేడియంలో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.పలు పోటీలలో ఏడు బహుతులు సాధించిన హసన్ నగర్‌లోని సెయింట్ సులేమాన్ హైస్కూల్ విద్యార్థులకు ఎమ్మెల్యే బహుమతులు ప్రధానం చేశారు.సెయింట్ సులేమాన్ హైస్కూల్ కరస్పాండెంట్ మహ్మద్ మస్తాన్ మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన విద్యార్థులుక్విజ్,స్పీస్‌తో పాటు ఏడు పోటీలలో విజయం సాధించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కాజీ అంజుమన్-ఇ- ఖాద్రియా అధ్యక్షులు అలీ ఖాద్రీ,సెయింట్ సులేమాన్ హైస్కూల్ కరస్పాండెంట్ మహ్మద్ మస్తాన్‌తో పాటు పలు పాఠశాలలకు చెందిన వేలాది మంది బాల బాలికలు పాల్గొన్నారు.

## ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో తాగిన మైకంలో మహిళ హల్‌చల్

**ఉప్పల్, నవంబరు 2 ప్రభాతవార్త :** ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో తాగిన మైకంలో ఒక మహిళ హల్‌చల్ చేసింది. మద్యం సేవించి చేతిని బ్లేడ్‌తో కోసుకుని స్టేషన్‌కు వచ్చి అధికారులతో వాగ్వివాదం చేసింది. దీంతో అధికారులు ఆమెకు బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షలు చేసి పంపించారు. మహిళ వివరాలు పోలీసులు వెల్లడించలేదు. తాగిన మైకంలో స్టేషన్‌కు వచ్చిందని, తిరిగి ఆమెను పంపించినట్లు పోలీసులు తెలిపారు.

## ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కారించాలని మంత్రికి విజ్ఞప్తి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సమస్యలు వివరిస్తున్న కెకెసి నాయకులు సంపత్‌రెడ్డి, మల్లేష్ తదితరులు

**సైఫాబాద్, డిసెంబరు 2 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కారించాలని అఖిల భారత అసంఘటిత కార్మికుల, ఉద్యోగుల కాంగ్రెస్ (కెకెసి) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సోమవారం కెకెసి ప్రతినిధి బృందం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రాన్ని సమర్పించింది. ఈ సందర్భంగా కెకెసి ప్రధాన కార్యదర్శి పింగిలి సంపత్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి రుద్రక్షా మలేష్ మీడియాతో మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వం ఆటో మీటర్ చార్జీలను పెంచలేదని, పెరిగిన ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ ఛార్జీలను పెంచాలని, బైక్ ట్యాక్సీని రద్దు చేయాలని, లేని పక్షంలో నిషేధించాలని, ఆటో డ్రైవర్లకు అందిస్తామని ప్రకటించిన ఆర్థిక సహాయం 12 వేల రూపాలయలు అందించాలని, ఆటో మీటర్ చార్జీని మినిమం 40 రూపాయలకు పెంచాలని ఓలా, ఊబర్, రాపిడో తదితర వాహనాలను రద్దు చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కెకెసి నాయకులు బి.సత్యనారాయణ, శివ, మమ్మద్ ఫరూక్ పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త**

పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్యం చాలా ఖరీదుగా మారిందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. సోమవారం గోల్నాకలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణి చేశారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన 18 మందికి 5.65లక్షల చెక్కులు పంపిణి చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికంలో ఉంటూ అనారోగ్య సమస్యలతో ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందినవారికి సిఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. కొన్ని జబ్బులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో నయం కావని, అందుకు అనుగుణంగా కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకొని ఆర్థికంగా నష్టపోయినవారికి సిఎంఆర్ఎఫ్ తోడ్పడుతుందన్నారు. ప్రభుత్వం ద్వారా వచ్చే సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎవరికి ఎలాంటి సహాయసహకారాలు కావాలని తనను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**నార్సింగి, డిసెంబర్ 2 ప్రభాతవార్త :** సోమవారం గుర్తు తెలియని మృతదేహంను నార్సింగి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలలోకి వెళితే... మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ గ్రామ స్మశాన వాటిక వద్ద మున్సిపల్ కార్మికులు సీతాఫలాలు తెంచేందుకు యత్నిస్తుండగా ఆ పక్కనే మృతదేహం కనిపించింది. దుర్వాసన వెదజల్లుతూ, పురుగులు పడి ఉన్న ఓ పురుషుడి మృతదేహంను గుర్తించి స్మశాన వాటిక ఇంచార్జి బోడ మాన్‌సింగ్‌కు తెలిపారు. ఆయన ఈ విషయంను నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి మృతదేహంను పరిశీలించారు. మృతుడు 30-40ఏళ్ల మధ్య వయసు కలిగి ఉంటాడని, ఎడమ చేతి మణికట్టు తెగిపడి ఉందని, ఎరుపు రంగు టీషర్టు, నీలిరంగు ప్యాంటు ధరించి ఉన్నాడని, సంబంధీకులు ఎవరైనా ఉంటే నేరుగా నార్సింగి పోలీసు స్టేషన్‌కు వచ్చి సంప్రదించాలని సూచించారు. మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి, కేసును దర్యాప్తు చేస్తున్నట్లు నార్సింగి పోలీసులు వివరించారు.

## వీర శైవ లింగాయత్‌ల కమిటే అసలైనది


సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ కమిటీ సభ్యులు

**వనస్థలిపురం డిసెంబర్.2.ప్రభాతవార్త :** వనస్థలిపురం ఫేస్ 1 లొ గల శ్రీ భ్రమరాంబిక సమేత శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ కార్యకలాపాలు 1983 నుండి నేటి వరకు వీర శైవ లింగాయత్ ల ఆధ్వర్యంలో నే నిర్వహించబడుతున్నాయని ఆలయ కమిటీ అసలైన నిర్వాహకులు దీపావళి శ్రవణ్ కుమార్,చౌదరి దివాకర్ లింగం,చంద్రమోళి,నందీశ్వర్,కె.వీరయ్య లు తెలిపారు. రాజప్ప నగర్ లొ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లా డుతూ కొందరు కాలనీ వాసులు తామే ఆలయ ప్రతినిదులమని పత్రికలలో ప్రకటించుకున్న విషయాన్ని తాము తీవ్రంగా ఖ దిస్తు న్నామన్నారు.2024 జూన్ లో తాము నూతన కమిటీని ప్రకటిం చుకున్నామని,కాగా ఆదివారం కొన్ని పత్రికలలో మనిశేఖర్ చైర్మన్ గా అధ్యక్షుడు గాండ్ల అంజయ్య,రాపోలు పురుషోత్తం, ఉప్పు వెం కటేష్ లు ప్రకటంచుకోవడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఆలయానికి ఎవరైనా రావొచ్చని, అయితే నిర్వహణ మాత్రం వీర శైవ లింగా యత్ కే ఉంటుందని,కాలనీ వాసులకు సంభంధం లేదన్నారు. ఈ సమావేశం లో బెన్నూరి శైలేష్,దీపావళి శ్రీకాంత్, బి.శ్రీని వాస్,మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేత


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి..

**నేరేడ్‌మెట్,డిసెంబర్ 2,ప్రభాతవార్త:** సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఎంతోమంది పేదలకు లబ్ది జరుగుతుందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మల్కాజిగిరి నియోజకవర్గ పరిధి లోని వినాయక్‌నగర్ డివిజన్ దీన్‌దయాల్ నగర్‌కు చెందిన ఇంది రా భాయ్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోవడం జరిగింది. మంజురైన 1లక్ష రపాయల చెక్కును ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులకు అందిం చడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం నిరుపేదల కోసం ఏర్పాటు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్‌ను నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రావుల అంజయ్య, డివిజన్ అధ్యక్షులు తులసి సురే ష్, డివిజన్ కార్యదర్శి బాలక్రిష్ణ గుప్తా బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పబ్బులో మాదక ద్రవ్యాల వినియోగం సహించం

**-కుషాయిగూడ ఏసిపి మహేష్..**


పబ్బులో ఆకస్మిక తనిఖీలు చేపడుతున్న పోలీసులు..

**నేరేడ్‌మెట్,డిసెంబర్ 2,ప్రభాతవార్త:** పబ్బుల్లో మాదక ద్రవ్యాల వినియోగాన్ని సహించేది లేదని కుషాయిగూడ ఏసిపి మహేష్ అన్నారు. నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహిస్తున్న కైరో, అర్బన్ హౌస్ పార్టీ, 10డి, హీరో జో తదితర పబ్బులను ఆయన నేరేడ్‌మెట్ ఇన్స్‌పెక్టర్ సందీప్ కుమార్ బృందంతో కలసి అకస్మిక తనిఖీలు నిర్వహించారు. మాదక ద్రవ్యాల వినియోగాలపై పబ్బు నిర్వాహకులతో ఆరా తీసారు. మాదక ద్రవ్యాల వినియోగాన్ని పసిగట్టే నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు చేసారు. మాదక ద్రవ్యాల కారణంగా జరిగే నష్టాలపై పబ్బు యజమానులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్ సంస్కృతిని ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేద న్నారు. పబ్బులకు వచ్చే కొత్త వారిపై నిఘా పెట్టాలని ఆయన అధికారులతో సూచించారు. రాత్రుల్లో నిర్ణీత సమయానికి పబ్బు ల్లో మూసివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధి కారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా ప్రజాపాలన సంబరాలు : కార్పొరేటర్


విధ్యార్థును ఉద్దేశించి మాట్లాడుతున్న కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

**సైదాబాద్, డిసెంబరు 2 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రజాపాలన సంబరాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సంబరాలలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలోని 8, 9వ తరగతి విద్యార్థులకు రోడ్డు నిర్మాణంపై అవగాహన కల్పించారు. ఈ సం దర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై అవగాహన కార్యక్ర మాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధం గా సిఎం రిలీఫ్ పండ్‌ను అందజేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రికార్డ్ సాధించడం జరిగిందన్నారు. ఏక కాలంలో రూ.2లక్షలు రుణ మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో డిసి సేవ ఇస్లావత్, ఇఇ కార్తీక్, డిఇ రవిచంద్ర కాంగ్రెస్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## గో రక్షణకు చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రికి వినతి


కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం అందజేస్తున్న బాలకృష్ణ గురుస్వామి

**సైదాబాద్, డిసెంబరు 2 ప్రభాతవార్త:** గో రక్షణ కోసం కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేస్తున్న బాలకృష్ణ గురుస్వామి బృందం కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని నాగపూర్‌లోని ఆయన నివాసంలో కలిసారు. దేశవాళి ఆవులను కాపాడాలని, గో ఆధారిత వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కోరుతూ తాము చేస్తున్న పాదయాత్రలో శ్రీనగర్ లాల్‌చౌక్ నుంచి కన్యాకుమారి వరకు రిధి గోమాత కూడా తమతే పాటే పాల్గొంటున్న విషయా న్ని వారు కేంద్ర మంత్రికి వివరించారు. కాగా తమ విజ్ఞప్తికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని, గో రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసకుంటుందని హామీ ఇచ్చినట్లు బాలకృష్ణ తెలిపారు. 14 రాష్ట్రాల గుండా 180 రోజుల పాటు 4900 కిలో మీటర్లు బాలకృష్ణ గురుస్వామి పాదయాత్ర నిర్వహి స్తున్నారు. గత ఏడాది అక్టోబరు 6వ తేదీన ప్రారంభమైన పాద యాత్ర ఈ సంవత్సరం మార్చి 16 వరకు కొనసాగుతుంది.

## ఇష్టారాజ్యంగా అక్రమ వ్యాపార సముదాయ నిర్మాణం : ఆందొజు


జోనల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న నాయకులు

**ఎల్‌బినగర్, డిసెంబర్ 2 ప్రభాతవార్త:** ఎల్బీనగర్ జోనల్ పరిధిలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా అక్రమ వ్యాపార సముదాయాలు పుట్టగొడుగుల్లా వెలుస్తు న్నాయని సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందొజు రవీంద్ర చారి పేర్కొన్నారు. సిబిఐ ఎల్బీనగర్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో పలు డివిజన్ల లో జరుగుతున్న అక్రమ వ్యాపార సముదాయలను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ కార్యాలయం వద్ద నియోజ కవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవా రం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ జోనల్ పరిధిలో అనేక అక్రమ నిర్మాణాలు జరుగు తున్న చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టౌన్‌ప్లానింగ్ ఏసీపీలకు వినతిపత్రాలు ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం లేదని శివగంగ కాలనీలో సర్వేనెంబర్ 66/8లో, బొమ్మలగుడి నుండి వీరన్నగుట్ట దారిలో అనేక అక్రమవ్యాపార సముదాయాలు, రేకుల షెడ్డు నిర్మిస్తున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. సర్వేనెంబర్ 199/1లో జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో ఉన్నటువంటి ఒక ఎకరం 9 గుంటల భూమికి ఫేనిషింగ్ చేసిన బిల్డర్ ఆ ఫేనిషింగ్ తొల గించి మళ్లీ నిర్మాణం చేసిన అధికారులు మామూలు మత్తులో ఉన్నారని ఆరోపించారు. అక్రమ నిర్మాణాలపై జోనల్ కమిషనర్ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జోనల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం జోనల్ కమిషనర్ హేమంత్‌కేశవ్‌పటేల్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాతరాజు నరసింహ, ఫైమిద, శేషరాజుపల్లి శ్రీదేవి, బోయపల్లి రాములుగౌడ్, కందుల సుధాకర్, మర్రి శోభన్, బి.అరుణ్‌కుమార్‌గౌడ్, రామావత్ సక్రునాయక్, సరిత, అనిత, సౌజన్య, జ్యోతి, సౌజన్య, నాగరాజు, చెంది వెంకట్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే అహ్మద్ బలాల


ఓల్డ్ మాలిక్ పేట లో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల, సైపుద్దీన్ షఫీ తదితరులు

**మలక్ పేట ,డిసెంబర్ 2, ప్రభాతవార్త:** ప్రజల సంక్షేమమే తమ ధ్యేయమని మలక్ పేట నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. ఓల్డ్ మలక్ పేట్ డివిజన్ లోని పలు ప్రాంతాలలో రూ. 5 కోట్ల 87 లక్షల 30 వేల తో బాక్స్ డ్రైయిన్, నూతన రోడ్డు నిర్మాణం పనులు తది తర అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే అహ్మద్ బలాల ,స్థానిక డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు సైపుద్దీన్ షఫీతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ మలక్ పేట్ నియోజకవర్గాన్ని అన్ని విధా లుగా అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దన్నున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని వివరించా రు. డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు సైపుద్దీన్ షఫీ మాట్లాడు తూ ఎమ్మెల్యే బలాల సహకారంతో ఓల్డ్ మలక్ పేట్ డివిజ న్ అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమాన్ని కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఇ శంకర్ ,వార్డు కమిటీ సభ్యులు శ్రీనివాస్, మున్సిపల్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రమణారెడ్డి, ఉపాధ్యక్షుడు సం దీప్, గోకుల్ దాస్ సోని తదితరులు పాల్గొన్నారు. దివ్యాం గులకు వీల్ చెయిర్స్, ట్రై సైకిల్స్ ను పంపిణీ చేసిన ఎమ్మె ల్యే బలాల ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని పురస్క రించుకుని జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో మలక్ పేట నల్గొండ చౌరస్తాలోని జాతీయ దివ్యాంగుల పార్క్ లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బలాల ముఖ్యఅతిథిగా హాజరై విక లాంగులకు చెక్కులు, ట్రై సైకిల్స్ ,వీల్ చెయిర్లను అందజే శారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని దివ్యాంగులు ఘనంగా జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసి జయంత్, యూసిడి అధికారి యుగంధర్ రెడ్డి, డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు సైపుద్దీన్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గం అభివృద్ధిపై ఎమ్మెల్యే శ్వేతపత్రం విడుదల చేయాలి



**మల్కాజిగిరి నబంబరు2,ప్రభాతవార్త** మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేర కు సోమవారం మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని ఆనంద్ బాగ్ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ కార్పొరేటర్ సీనియ ర్ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు,సీనియర్ నాయకులు మాట్లాడు తూ ఎమ్మెల్యేగా గెలుపొంది సంవత్సర కాలమైన మర్రి రాజశేఖర్ రెడ్డి ఒక నయాపై అభివృద్ధి చేయలేదని కేవలం వినతి పత్రాలకే పరిమితమయ్యారని తను చేసిన పని ఏమి టో శ్వేత పత్రం విడుదల చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకు లు డిమాండ్ చేశారు.మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమం తరావు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తెచ్చిన నిధులతోనే కొబ్బరి కాయలు కొడుతూ తానే చేస్తున్నానని చెప్పుకుంటూ సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్నారని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. మైనంపల్లి హనుమంతరావు మోలాలి కమాన్ ఆర్ యు బి పనులు తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తెచ్చిన నిధుల తోటే కాకుండా ఇప్పుడు సంవ త్సరంలో సుమారు 21 కోట్లు అభివృద్ధి పనులకు తాను సాంక్షన్ చేయించడం జరిగింది వారు తెలిపారు . ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రేమ్ కుమార్ జితేంద్రనాథ్ సీనియర్ నాయకులు బీ బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ జి ఎన్ వి సతీష్ కుమార్,బీకే శ్రీనివాస్, పిట్టల శ్రీనివాస్, లక్ష్మీకాంత్ రెడ్డి, ఎస్ ఆర్ ప్రసాద్, బాబు, సత్యనారా యణ, రాందాస్ సంతోష్ ముదిరాజ్, నరేందర్ గౌడ్, స య్యద్ మబ్బు,ఫరీద్, అధ్యక్షులు సంపత్ గౌడ్ వైనాల ప్రవీణ్, వినోద్ యాదవ్, ఇందిరా ప్రియదర్శిని ఆశ చెన్నా రెడ్డి, చంద్రకాంత్ ఇస్తారి, కన్న, సిరిగిరి రాజు, బాలరాజు యాదవ్ ఆగమయ్య, వెంకటేశ్వరరావు, ఫారుక్, మంద భాస్కర్, చందు, తదితరులు పాల్గొన్నారు

## బిఆర్ఎస్ పాలనలో పైలెట్ ప్రాజెక్ట్ కింద చేపట్టిన అభివృద్ధి పరిశీలన


జిల్లెలగూడ ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకుల బృందం

**సరూర్‌నగర్, డిసెంబర్ 2 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని చల్లా లింగారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను సోమవారం కార్పొరేషన్‌కు చెందిన బిఆర్ఎస్ పార్టీ బృందం సందర్శించింది. ప్రస్తుత స్థానిక నియోజకవర్గ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో విద్యా శాఖ మంత్రిగా ఉన్న సమయం లో పైలట్ ప్రాజెక్ట్ కింద చేపట్టిన అభివృద్ధి పనులు ఏ విధంగా విద్యార్థులకు ఉపయోగపడుతున్నాయనే దానిపై బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకుల బృందం పాఠశాల సందర్శన సందర్భంగా పరిశీలన జరిపింది. కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్ బొక్క రాజేందర్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు ఎం.ఎ.రజాక్, పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, మహిళాధ్యక్షురాలు జమాల్‌పూర్ సునీత బాలరాజ్‌లతో పాటు పలువురు గత ప్రభుత్వ పాలనలో విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన డిజిటల్ క్లాస్ రూమ్‌లను సందర్శించి విద్యార్థుల అభిప్రాయాలను తీసుకున్నారు. అదే విధంగా మధ్యాహ్న భోజన పథకంపై కూడా ఆరా తీసి భోజన నాణ్యతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు.

## ఉప్పల్‌లో నకిలీ వైద్యులను పట్టుకున్న మెడికల్ కౌన్సిల్ అధికారులు

**-అర్హత లేకున్నా రోగులకు వైద్యం : డిస్టిల్ వాటర్‌తోనే సూది మందు**


రామంతాపూర్‌లో నకిలీ వైద్యుడిని పట్టుకున్న తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అధికారులు దృశ్యం.

**ఉప్పల్, నవంబరు 2 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధి లోని పలు ప్రాంతాల్లో రిజిస్టర్ వైద్యుడి పేరుతో చికిత్స చేస్తున్న నలుగురు నకిలీ వైద్యులను తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అధికారులు పట్టుకున్నారు. ఎంబిబిఎస్ డాక్టర్లుగా పేర్కొంటూ అర్హత లేకున్నా వైద్యం చేస్తూ రోగుల ప్రాణాల తో చెలగాటం ఆడుతున్నారని అధికారులు పేర్కొంటున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ పిఆర్ కమిటి చైర్మన్ డా.నరేష్‌కుమార్, సిపిడి కమిటి చైర్మ న్ డా.ప్రతిభ లక్ష్మి, హెచ్ఆర్‌డిఏ రాష్ట్ర నాయకులు డా.బి. వంశీకృష్ణల ఆధ్వర్యంలో ఉప్పల్, రామంతాపూర్, బీరప్ప గడ్డలలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. రామంతా పూర్ నెహ్రూనగర్‌లో ఎస్‌వీఎల్ క్లినిక్ డా.నరసింహచారి ఎంబిబిఎస్ పేరు మీద అనుమతి తీసుకుని నకిలీ వైద్యుడు అవంచ సురేష్ అక్కడే ఉంటూ వైద్యుడిగా చెప్పుకుంటూ మేనేజింగ్ డైరెక్టర్ హోదాలో వైద్య పరంగా ఎటువంటి విద్యార్హత లేకున్నా చికిత్స చేస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపా రు. అదే ప్రాంతంలో బాలాజీ ఫస్ట్ ఎయిడ్ నిర్వహకుడు నాగేశ్వర్‌రావు నొప్పి నివారణ ఇంజక్షన్లు, ఇతర మందులు షెడ్యూల్ చట్ట విరుద్దంగా పేషంట్లకు ఇస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రామంతాపూర్ రాంరెడ్డి నగర్‌లో ఆర్ఎంపి అసోసియేషన్ అధ్యక్షుడు, ఉషోదయ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వహకుడు యాదగిరి వైద్యుడిగా చెప్పుకుంటూ రోగులకు మందులు రాస్తూ డిస్టిల్ వాటర్‌ను వందల సంఖ్యలో నిల్వ ఉంచి వాటినే సూది మందులాగా ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు. వీటితోపాటు, అంటి బయోటిక్ ఇంజక్షన్లు, స్టెరాయిడ్ ఇంజక్షన్లు రోగులకు వాడు తున్నట్లు ఆధారాలు సేకరించామని తెలిపారు. ఉప్పల్ బీరప్పగడ్డలో నకిలీ వైద్యుడు బి.శ్రీను వైద్యుడిగా పేర్కొం టూ రోగులకు మందులు రాయడంతో వందల సంఖ్యలో నొప్పి నివారణ ఆంపుల్స్, పిల్లలకు వాడే అంటిబయాటిక్ సిరప్‌లు, స్టెరాయిడ్ వయల్స్, డ్రగ్ కంట్రోల్ అధారిటి నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా విఐఇ లాక్ గ్రూప్ హెల్త్ కేర్ ఏజెన్సీ నుంచి తీసుకున్నారని తెలిపారు. డ్రగ్స్ కంట్రోల్ కమిషనర్ కమలహాసన్‌రెడ్డికి ఫిర్యాదు చేయ దంతో వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకుంటున్నారని డా.నరేష్‌కుమార్ తెలిపారు.

## అరు గ్యారంటీలు అమలు చేయాలని బిజెపి నేతల ధర్నా

**ఉప్పల్, నవంబరు 2 ప్రభాతవార్త :** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యేలు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, బేతి సుభాష్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఈ మేరకు బిజెపి ఆధ్వర్యంలో ఆరు గ్యారంటీలు అమలు చేయాలని ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమం లో మాజీ ఎమ్మెల్యేలు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, బేతి సుభా ష్‌రెడ్డి, బిజెపి మహిళా మోర్చ అధ్యక్షురాలు డా.శిల్పారెడ్డి, కార్పొరేటర్ బండారు శ్రీవాణిలు పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఏడాది పాల నలో ఒక్క పథకం కూడా సక్ర మంగా అమలు చేయలేదని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమం లో బిజెపి డివిజన్ అధ్య క్షులు రెడ్డిగారి దేవేందర్‌రెడ్డి, బం డారు వెంకట్రావ్, గోనె శ్రీకాంత్, సీనియర్ నేతలు మహం కాళి లక్ష్మన్, శామీర్‌పేట ధర్మారెడ్డి, రావుల బాలకృష్ణగౌడ్, ఏసూరి యాదగిరి, మార్నెని పణీందర్, రేవల్లి రాజు, తీగ విఠల్‌రావు, వర్కల రాజేందర్‌గౌడ్, గొరిగె వెంకటేష్, బస్వ రాజు,తాళ్ల శ్రీనివా స్‌గౌడ్, షకీర్, నర్సి రెడ్డి, ఉప్పు శంకర్ గుప్త,నరసింహా, నవీన్‌గౌడ్, శ్రీకాంత్, రావుల అఖి లేష్‌గౌడ్, పరుశరామ్, మేనక, అనిత, సత్యనారాయణ పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువు పట్ల ఆసక్తి పెంచుకోవాలి : చింతల


విద్యార్థులకు సైకిల్ పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ అరుణసురేందర్‌యాదవ్

**ఎల్‌బినగర్, డిసెంబర్ 2 ప్రభాతవార్త:** విద్యార్థులు క్రమశిక్షణ పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరో హించాలని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్‌యాదవ్ పేర్కొన్నారు. నాగోల్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం రోటరీక్లబ్ డైరెక్టర్ ఆఫ్ కమ్యూ నిటీ సర్వీస్ ప్రభాకర్, మాజీ అసిస్టెంట్ గవర్నర్ సరిత ఆధ్వర్యంలో పాఠశాలలోని పేద విద్యార్థులకు కార్పొరే టర్ సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువు పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. ఈ సంద ర్భంగా ఇటీవల జరిగిన టాలెంట్ పరీక్షలలో ప్రతిభ కన బరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్ అందజేశారు.కార్య క్రమంలో నాయకులు కాలంశెట్టి లయ, హరిబాబు, చం ద్రశేఖర్‌గుప్త, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సమర్ధ మాతాజీ విజయలక్ష్మి కన్నుమూత

**ఎల్‌బినగర్, డిసెంబర్ 2 ప్రభాతవార్త:** పంచముఖ ఆంజనేయస్వామి వారి ఉపాసకురాలు సమర్థ మాతాజీ విజయలక్ష్మి అమ్మగారు కన్నుమూశా రు. కొత్తపేట డివిజన్ స్నేహపురికాలనీకి చెందిన పంచ ముఖ ఆంజనేయ స్వామి వారి ఉపవాసకురాలుగా ప్రసి ద్ధిగాంచిన విజయలక్ష్మి ఆదివారం తుదిశ్వాస విడిచారు. ఆర్కెపురం, కొత్తపేట, స్నేహపురికాలనీ తదితర ప్రాం తాలలో నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో విజయ లక్ష్మి పాల్గొని ప్రవచనాలు చేసేవారు. విజయలక్ష్మి మృతి పట్ల టిపిసిసి సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి సం తాపం ప్రకటించారు.

## ట్రంక్‌లైన్ పనులను త్వరలోనే ప్రారంభిస్తాం: ఎమ్మెల్యే


ఎమ్మెల్యేను కలిసి తట్టిఅన్నారం గ్రామస్తులు

**హయత్‌నగర్, డిసెంబరు 2 ప్రభాతవార్త:** అధికారులతో సమీక్షించి తట్టిఅన్నారం గ్రామం, అనుబంధ 12 కాలనీ లకు సంబంధించిన డ్రైనేజీ ట్రంక్‌లైన్ ఔట్‌లెట్ పనుల ను త్వరలోనే పూర్తిచేసేలా చూస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. అవుట్‌లెట్ పనులకు సంబంధించి డీపీఆర్ పనులు పూర్తయ్యాయని ట్రంక్‌లైన్ పనులను ప్రారంభించాలని కోరుతూ గ్రామస్థు లు ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి విన్నవించా రు. దీనిపై ఆయన స్పందిస్తూ ఒకటిరెండు రోజుల్లో కమిషనర్‌తో మాట్లాడి ట్రంక్‌లైన్ పనులు ప్రారంభించే లా చర్యలు తీసుకుంటామన్నారు. వెజ్-నాన్‌వెజ్ మా ర్కెట్ ఏర్పాటుపై కూడా అధికారులతో చర్చిస్తానని హామీనిచ్చారు. మున్సిపాలిటీ పరిధి పెద్దఅంబర్‌పేటలో ఇప్పటికే 6 కోట్లరూపాయలతో చేపట్టిన ట్రంక్‌లైన్ పను లు పూర్తి కావస్తున్నాయని మిగితా గ్రామాల్లో సైతం డ్రైనేజీ పనులు పూర్తిచేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు.

## ఓపెన్‌జిమ్,రోడ్ ఫార్మేషన్ పనులను త్వరలోనే పూర్తిచేస్తాం


వాకర్స్, కాలనీవాసులతో మాట్లాడుతున్న కొప్పుల నర్సింహారెడ్డి

**హయత్‌నగర్, డిసెంబరు 2 ప్రభాతవార్త:** చిన్నచిన్న సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా సోమవారం ఆయన హయత్‌నగర్ డిగ్రీ కళాశాల, జేవైఎన్ కాలనీలో పర్యటించారు. ఈ సంద ర్భంగా కళాశాలతో పాటు జేవైఎన్ కాలనీలో రోడ్డు ఫార్మేషన్ చేయించాలని, మార్నింగ్ వాకర్స్‌కు అనువు గా ఉండేలా కళాశాల ఆవరణలో ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై కార్పొరేటర్ స్పందిస్తూ... జేవైఎన్ కాలనీ ప్రధాన రోడ్డుఫార్మేషన్ కోసం అధికారు లను పిలిపించి త్వరలోనే సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సీఏఆర్ కాలనీ నుంచి మొదలైన ట్రంక్‌లైన్ దాదాపు పూర్తయ్యిందని, పద్మావతి కాలనీ సమీపంలో చిన్న సమస్య వల్ల పనులు నిలిచిపోయాయని త్వరలోనే పనులను పూర్తిచేస్తామన్నారు. కళాశాల గ్రౌండ్‌ను శు భ్రంచేయించడంతో పాటు ఓపెన్‌జిమ్ ఏర్పాటుకు చర్య లు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీల ప్రతినిధులు అనుప్‌రెడ్డి, వెంకటేష్, నర్సింహా, శ్రావణ్ కుమార్, శివయాదవ్, శ్రీకాంత్‌యాదవ్, కృష్ణ, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

## చిలుకానగర్ దర్గాలో ఘనంగా ఉర్సు వేడుకలు


చిలుకానగర్ దర్గాలో ఉర్సు వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, నవంబరు 2 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్ హజరత్ బద్రుద్దీన్ హజరత్ జిందాషా మదర్ దర్గాలో ఇస్మాయిల్ ఆధ్వర్యంలో ఉర్సు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బాబా ఆశీస్సులతో చిలుకానగర్ డివిజన్ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని అకాంక్షించినట్లు తెలిపారు. ఉత్సవాలు శాంతియుతంగా చేసుకోవాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నేతలు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, మహుమూద్, అశోక్‌చారి, ఎండి షఫీ, గౌస్, నర్సింగ్‌రావు, హమీద్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్‌ల సమస్యను ఏ నాయకుడు పరిష్కరించిన స్వాగతిస్తాం : 118 జి.ఓ.ఐక్యవేదిక


సమావేశంలో మాట్లాడుతున్న వివిద కాలనీల ప్రతినిధులు

**వనస్థలిపురం. డిసెంబర్.2.ప్రభాతవార్త :** బి.యన్.రెడ్డి.నగర్ డివిజన్‌లో రిజిస్ట్రేషన్ ల సమస్యను పరిష్కరించేందుకు ఎల్.బి. నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి 118 జి.ఓ.ను తీసుకువచ్చి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసారే తప్ప మోసం చేయ డానికి కాదనీ 118 జి.ఓ.ఫోరమ్ ప్రతినిధులు తెలిపారు. కొంద రు వ్యక్తులు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ని కించపరుస్తూ విడుదల చేసిన కరపత్రం లోని కొన్ని అంశాలను తీవ్రంగా ఖండిస్తున్నా మన్నారు. ఎస్. కె.డి. నగర్ లోని సంక్షేమ భవనం లొ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఫోరమ్ ప్రతినిధులు పుల్లారెడ్డి, సుధాకర్ రెడ్డి,పొగుల రాంబాబు,చీమర్ల కృష్ణారెడ్డి తదితరులు మాట్లాడుతూ బి.యన్.రెడ్డి. నగర్ లోని 7 కాలనీ లకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ల సమస్య గురించి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఎలాంటి స్వార్ధం లేకుండా 118 జి.ఓ. తీసుకు వచ్చి, కన్విని యన్స్ డీడ్ ద్వారా కొన్ని ఇండ్లకు రిజిస్ట్రేషన్ లు చేయించార న్నారు. అప్పుడే అందరూ ఎమ్మెల్యే ను అభినందించారన్నారు. కొందరికి అనుమతులు వచ్చి బ్యాంక్ ల ద్వారా రుణాలు తీసు కొని ఇండ్లు నిర్మించుకున్నారన్నారు. ప్రభుత్వం మారడంతో 118 జి.ఓ.ను నిలిపివేశరని,దీంతో సమస్య వచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 118 జి.ఓ.ను సవరించి,22ఏ జి.ఓ.ను తొల గించాలని కోరారు. మా సమస్యను ఏ నాయకుడు పరిష్కరించిన అభినదిస్తామని,తమకు రాజకీయాలతో సంభందం లేదన్నారు. ఈ సమావేశంలో రాజిరెడ్డి,ముత్యం రావు,మువ్వ సతీష్ చౌదరి, జగన్ మోహన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, యాదగిరి, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల హాస్టల్స్ సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి

**-టిపిసిసి ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్**


సమావేశంలో ప్రసంగిస్తున్న చెకోలేకర్ శ్రీనివాస్ తదితరులు

**మలక్ పేట ,డిసెంబర్ 2, ప్రభాతవార్త :** గురుకుల హాస్టల్స్ సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని టిపిసిసి ప్రధాన కార్యదర్శి చేకోలేకర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మలక్ పేట సలీం నగర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ...ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రోజురోజుకీ పెరుగుతున్న ఆదరణ చూసి భరించలేక బిఆర్ఎస్ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. గురుకుల సంక్షేమ హాస్టల్స్ లో నాసిరకం బియ్యం అందిస్తూ విద్యార్థుల మరణాల కారణమవుతున్న వారిపై రాష్ట్ర ప్రభుత్వం కాఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గురుకుల సంక్షేమ హాస్టల్స్ లో జరుగుతున్న సంఘటనలపై ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని, సంఘటనలకు బాధ్యులై న వారిని గుర్తించి కఠిన చర్యలు చేపట్టడం జరుగుతుందని వివరించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే స్థానిక అధికారులకు, కాంగ్రెస్ నాయకులకు సమాచారం అందించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి బిఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణ చేస్తున్నారన్నారని ఆరోపించారు. బిఆర్ఎస్ నాయకులు, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అసత్య ఆరోపణలు చేయకుండా తగిన సలహాలు, సూచనలు అందించాలని వాటిని పరిగణలోకి తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహమ్మద్ షకీల్, డివిజన్ అధ్యక్షులు లింగాల శ్రీనివా స్ గౌడ్, రాహుల్ సింగ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహేష్ ఎస్టీ హాస్టల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు : కార్పొరేటర్


విద్యార్థులతో సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

**నాచారం, డిసెంబర్ 2 ప్రభాతవార్త:** గురుకుల, మైనార్టీ రెసిడెన్సియల్ పాఠశాలల్లో లెలకొన్న సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర కమిటి ఆదేశాల మేరకు నా చారంలో ఉన్న మైనార్టీ స్కూల్లో కార్పొరేటర్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి, విద్యార్థులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్కూల్లో సౌకర్యాలు లేవని, బాత్ రూంలు క్లీన్‌గా లేవని, ఆహా రం సరిగా పెట్టడంలేదని విద్యార్థులు వారికి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు నర్సింగ్, జె.కృష్ణ, ప్రశాంత్ గౌడ్, దినేష్, చెట్టుకూరి సంతోష్, వినయ్, బీఆర్ఎస్ నాయకులు సాయిజన్ శేఖర్, విఠల్ యాదవ్, కట్టబుచ్చన్న గౌడ్ పాల్గొన్నారు.

## ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నాం: మేయర్



**సరూర్‌నగర్, డిసెంబర్ 2 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పి స్తున్నామని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం కమీషనర్ పి.సరస్వతి ఆధ్వర్యంలో మేయర్ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 25 అంశాలకు సంబంధించి రూ.52 కోట్ల పనులకు సంబంధించిన అజెండాను పాలకవర్గానికి సంబం ధించిన డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్‌తో పాటు కార్పొరేటర్లం దరూ ముక్తకంఠంతో ఆమోదించారు. అనంతరం మేయర్ పారి జాత మాట్లాడుతూ కార్పొరేషన్ ప్రజల కోసం కోట్లాది రూపా యలను కార్పొరేషన్ తరపును వెచ్చించి రోడ్లు, డ్రైనేజీలతో పాటు పలు మౌలిక సౌకర్యాలను కల్పించడం జరుగుతున్నదని వివరిం చారు. అంతే కాకుండా కార్పొరేషన్‌లో పారిశుధ్యంపై కూడా ప్రత్యేక దృష్టికి సారించామని ఆమె వెల్లడించారు. గతంలో కన్నా ఇంకా మెరుగైన ర్యాంకు కార్పొరేషన్‌కు వచ్చే విధంగా ప్రజలు సహకరించాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, పార్టీల ఫ్లోర్ లీడర్లు, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, కమీషనర్ సరస్వతి, డిఇలు యాదయ్య, జ్యో తిరెడ్డి, నర్సింహరాజు, ఎఇ వినీల్‌గౌడ్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ వంకాయల యాదగిరి, మేనేజర్ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.